257) ఆహిరి

ప॥ ఎటువంటి వలపులో యిద్దరికిని । చిటుకంటే మెచ్చేవు శ్రీనరసింహా ॥

చ॥ గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా । పరగ నీ మోము తప్పక చూడగా ।
సరుగున నీవు వచ్చి సంగడినే కూచుండి । సిరులతో బొగడేవు శ్రీనరసింహా ॥

చ॥ యెదురు మేడపై నెక్కి యెలుగెత్తి పాడిపాడి । వుదుటున దామరపూవుల వేయగా ।
పొదిగి నీవంతలోనే బుజముపై జేయివేసి । చెదరక చెక్కంటేవు శ్రీనరసింహా ॥

చ॥ పఱపుపై నీకె పరాకున జెలితోడ । అఱిముఱి నిన్ను జూపేకాంత మాడగా ।
మెఱయ శ్రీవేంకటాద్రిమీద వచ్చి కూడితివి । చెఱగువట్టి చొక్కుతా శ్రీనరసింహా ॥